

బంతి సోయగం.. ప్రకృతి పరవశం

మహేశ్వరం నుంచి మన్‌సాన్‌పల్లి చౌరస్తాకు వెళ్లే రోడ్డు పక్కన బంతి తోటలోని పూల సోయగాలు ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటున్నాయి. రోడ్డు పక్కన విరబూసిన పసుపు పచ్చని పూల అందాలు ఆ దారివెంట వెళ్లేవారిని సంభ్రమాశ్చర్యానికి గురిచేస్తున్నాయి. కొందరు తోటలోకి వెళ్లి సెల్ఫీలు దిగి ఆనంద పడుతున్నారు.

- మహేశ్వరం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి)



కార్తీక దీపోత్సవంలో భక్తులు

కార్తీక వెలుగులు

కీసరగుట్టలో కార్తీక మాసోత్సవం దేదీప్యమానంగా సాగుతోంది. ప్రతి రోజు క్షేత్రంపై దీపోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం స్వామివారికి నిత్య సేవల్లో భాగంగా శ్రీ మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంకాలం వేళ ఆలయం వెలుపల దీపోత్సవం కార్యక్రమం నిర్వహించారు. భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం శర్మ, ఈవో సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కీసర, నవంబరు22 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో నేడు

ప్రత్యేక ఓటరు నమోదు

కొడంగల్/తాండూరు,నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈనెల 23, 24 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించడం జరిగిందన్నారు. ఎస్ఎస్ఆర్-2025 ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా రెండోసారి ఈ నెల 23, 24 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా తాండూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 279 పోలింగ్ కేంద్రాల్లో ఈ కార్యక్రమం కొనసాగనుంది.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

బషీరాబాద్/కులకచర్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బషీరాబాద్ మండలానికి 54 కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు మంజూరైనట్లు తహసీల్దార్ వై.వెంకటేష్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో పంపిణీ చేయన్నుట్లు తెలిపారు. అలాగే కులకచర్లలోని రైతు వేదికలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పంపిణీ చేయనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు తెలిపారు.

రేపు వేంకటేశ్వరాలయంలో కార్తీక దీపోత్సవం

తాండూరు రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : దస్తగిరిపేట్ శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరాలయంలో 24వ తేదీన కార్తీక దీపోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అర్చకుడు, ధర్మకర్త పురందరాచార్ శుక్రవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా 24వ తేదీన శ్రీవారికి మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ కారక్రమాలు జరుగుతాయన్నారు. దీపోత్సవం సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమవుతుందని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నిధులున్నా.. నిర్లక్ష్యం!

ఎంపీ ల్యాడ్స్ వినియోగంలో అలసత్వం

కేంద్రం నుంచి నిధులు విడుదలవుతున్నా ఎంపీలు వాటిని వినియోగించుకోవడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. ఏడాదికి రెండు మార్లు వచ్చే ఈ ల్యాడ్స్‌తో పార్లమెంట్ నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టవచ్చు. కానీ వచ్చిన నిధుల్లో సగం కూడా వీటి కోసం ఖర్చు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. ఎంపీ నిధులతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు, శంకుస్థాపనలకే పరిమితమవుతున్నాయి.

చేవెళ్ల ఎంపీ అభివృద్ధి నిధుల ఉపయోగం అంతంతే..

2019-20, 2023-24 వరకు 289 పనులకు రూ.17 కోట్లు మంజూరు

రూ. 1,567.28 లక్షలతో 108 పనులు మాత్రమే పూర్తి

జిల్లాలో ఇతర ఎంపీల నిధులు, పనులు కూడా ఇదే తీరు..

అభివృద్ధి పనులు ప్రతిపాదనలు, శంకుస్థాపనలకే పరిమితం

పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు



మహేశ్వరం మండలం తుమ్మలూరులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న అప్పటి ఎంపీ రంజిత్‌రెడ్డి (ఫైల్)

ఉమ్మడి జిల్లాలో ప్రతిపాదిత పనుల పురోగతి

ఎంపీ	మంజూరైనవి	పూర్తయినవి	అంచనా వ్యయం (లక్షల్లో..)	ఖర్చు చేసింది (లక్షల్లో..)
రేవంత్‌రెడ్డి (మల్కాజిగిరి)	23	15	100.97	58.972
కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి (భువనగిరి)	75	36	97.99	46.499
పోతుగంటి రాములు (నాగరకర్నూల్)	40	29	156.65	92.530
మన్నె శ్రీనివాస్ (మహబూబ్‌నగర్)	33	11	139.50	36.531

వికారాబాద్/మేడ్చల్ ప్రతినిధి, 22 (ఆంధ్రజ్యోతి) : ఓవైపు అభివృద్ధి పనులకు నిధుల కోసం ఎదురు చూస్తుంటే.. మరో వైపు ఉన్న వాటిని వినియోగించుకోవడంలో ఎంపీలు వెనుకబడి పోతున్నారు. ఎంపీ ల్యాడ్స్ కింద రూ.కోట్లు నిధులు విడుదలవుతున్నా వాటిని ఖర్చు చేయడంలో తాత్సారం జరుగుతోంది. పార్లమెంట్ నియోజకవర్గాల అభివృద్ధి నిధులు (ఎంపీ ల్యాడ్స్) ఖర్చు పెట్టడంతో నిర్లక్ష్యం అలుముకుంది. కేంద్రం నుంచి వచ్చిన నిధులను సకాలంలో సద్వినియోగం చేసుకోవడంలో ఎంపీలు విఫలమవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఎంపీలు తాము ప్రాతినిధ్యం

మిగతా 7వ పేజీలో...



గుండ్లమడుగుతండా వద్ద రోడ్డును కొలతలు చేయిస్తున్న తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

అసంపూర్తి పనులు పూర్తి చేయాలి

తాండూరు రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తాండూరు మండలం జినుగుర్తి నుంచి తట్టేపల్లి వరకు గల ఆర్అండ్‌బీ రోడ్డు పనులను అటవీ, ఆర్ అండ్ బీ శాఖ అధికారులు ఆరునెలల్లో పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం తాండూరు మండలం గుండ్లమడుగుతండా సమీపంలో సుమారు 10కిలో మీటర్ల దూరంలో నిలిచిపోయి అసంపూర్తిగా ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డును పరిశీలించారు. జినుగుర్తితండా అటవీ శివారులోని 3కిలోమీటర్లు, గుండ్లమడుగుతండా అటవీ శివారులో 7.5కిలో మీటర్ల దూరంలో అటవీ శాఖకు సంబంధించిన భూమి ఉండటంతో అప్పట్లో అటవీ శాఖ అధికారులు బీటీ రోడ్డు పనులు పూర్తి చేసేందుకు అనుమతులు నిరాకరించారు. కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని ప్రజల ఇబ్బందులు తొలగించేందుకు అటవీ శాఖ పర్యావరణ అనుమతులు కోసం ట్రైనీ కలెక్టర్ ఉమహారతి, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్, ఆర్అండ్‌బీ శాఖ తాండూరు ఇన్‌చార్జీ డీఈ శివకుమార్‌లతో క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. 9మీటర్ల వెడల్పుతో బీటీ రోడ్డుగా మార్చేలా చర్యలు చేపట్టాలని ఆర్అండ్‌బీ, అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రయాణికుల ఇబ్బందుల తెలుసుకుని అధికారులతో చర్చించారు. ఆయన వెంట తాండూరు తహసీల్దార్ తారాసింగ్, శ్రీదేవి, వెంకటలక్ష్మీ, ఆనంద్, మాణిక్‌రావు, మల్లయ్య, ఆర్అండ్‌బీ శాఖ అధికారులు ఉన్నారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ వానాకాలంలో పండించిన ధాన్యాన్ని విక్రయించుకునేందుకు రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

గ్రూపు -2 అభ్యర్థులకు మాక్ టెస్టులు

వికారాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో గ్రూప్-2 పరీక్షల్లో పాల్గొనే మైనార్టీ అభ్యర్థుల (ముస్లిం, క్రైస్తవ, సిక్కు, జైన్, పార్సి, బౌద్దులు)కోసం ఉచిత ఆఫ్‌లైన్ మాక్ టెస్టులను డిసెంబరు 2,3,9,10 తేదీల్లో ఉదయం మధ్యాహ్నం నిర్వహించడం జరుగుతుందని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి హన్మంత్‌రావు తెలిపారు. అర్హత గల అభ్యర్థులు తమ దరఖాస్తులను నవంబరు 29 తేదీ లోపు వికారాబాద్ కలెక్టరేట్‌లోని మైనార్టీ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వివరాలకు 9912740115 నెంబరుకు సంప్రదించాలన్నారు.



మీరాలం అలుగు ధ్వంసం!

కుంట కట్టను ధ్వంసం చేసిన దుండగులు

నీరంతా వృథా, సగం చెరువు ఖాళీ

పట్టించుకోని ఆయా శాఖల అధికారులు

అలుగు నిర్మించాలని స్థానికుల డిమాండ్



పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలో మీరాలం కుంట కట్టకు పెట్టిన గండి

ఘట్‌కేసర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జలవనరులను కాపాడాల్సి అధికారులు చూసిచూడనట్లుగా వ్యవహరిస్తుండటంతో అక్రమార్కులు చెరువులు, కుంటలకు గండ్లుపెడుతూ, ఆక్రమణకు పాల్పడుతున్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలోని మీరాలం కుంట అలుగుకు గుర్తుతెలియని వ్యక్తులు గండిపెట్టారు. దీంతో చెరువులోని సగంనీరు దిగువకు పోయింది. చెరువులోని నీరు దిగువకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన పైపులను గుర్తు తెలియని వ్యక్తులు రాత్రికిరాత్రే తొలగించి గండి కొట్టారు. దీంతో నాలుగైదు రోజులుగా నీరంత వృథాగా పోతోంది. ఇంతజరుగుతున్నా ఇరిగేషన్ అధికారులు మాత్రం తమకేమిపట్టదన్నట్లుగా వ్యవహరిస్తూ కనీస చర్యలు చేపట్టక పోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. హైదరాబాద్ -- వరంగల్ జాతీయ రహదారికి అనుకొని ఉన్నఈ కుంట చుట్టూ నివాస గృహాలు వెలిశాయి. గత ప్రభుత్వంలో ఈచెరువు అభివృద్ధికి రూ, 30లక్షలు వెచ్చించి కట్టను అభివృద్ధి చేశారు. ప్రధానంగా చెరువు కట్టతో పాటు నూతనంగా తూమును నిర్మించి చెరువుకట్టను పటిష్టం చేశారు. కానీ ఇప్పటివరకు ఎఫ్‌టీఎల్ హద్దులు ఏర్పాటు చేసి పక్కాగా అలుగు నిర్మాణం చేయక పోవడంతో ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు వ్యవహరిస్తున్నారు. ఇలా పలుమార్లు అలుగు

మిగతా 8వ పేజీలో...

అలుగును పునరుద్ధరించాలి



పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ మీరాలం కుంట అలుగును అభివృద్ధి చేసి నీటిని దిగువకు వెళ్లకుండా కాపాడాలి. ఎఫ్‌టీఎల్ నిబంధలన ప్రకారం అలుగు ఏర్పాటు చేయాలి. చెరువులో మురుగునీరు కలువకుండా చర్యలు తీసుకోవాలి. ప్రధానంగా కులవృత్తుల వారికి ఉపయోగపడే విధంగా చెరువును అభివృద్ధి చేయాలి. మిరాలంకుంట అలుగును అభివృద్ధి చేయడంలో అధికారులు వ్యవహరిస్తున్న తీరు అనుమానాలకు తావిస్తున్నది.

- నల్లపెల్లి లక్ష్మి, కౌన్సిలర్, పోచారం

పీఎస్ నిర్మాణానికి స్థల పరిశీలన

బొంరాస్‌పేట్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): దుద్యాల మండలం లగచర్ల ఘటన నేపథ్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. లగచర్లలో అధికారులపై జరిగిన దాడి అనంతరం పోలీసు శిబిరాలు తాత్కాలికంగా బొంరాస్‌పేట్ మండలంలో ఏర్పాటు చేశారు. శిబిరాల నిర్వాహణ ఇబ్బందిగా మారడంతో తాత్కాలికంగా దుద్యాల మండల కేంద్రం, దుద్యాల గేటు సమీపంలో పతాంజలి యోగాశ్రమం దగ్గర తాత్కాలిక శిబిరాలను ఎస్పీ నారాయణరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. లగచర్లలో ఉన్న అదనపు బలగాలకు అక్కడి నుంచే భోజన వసతి, విశ్రాంతి కోసం ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం.అంతేకాకుండా దుద్యాల పోలీస్‌స్టేషన్ భవనం కోసం స్థలాన్ని ఎస్పీ పరిశీలించారు.





మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, తదితరులు

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలి

బషీరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని కాశీంపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ సన్నాలు, దొడ్డు రకం ధాన్యం ఏ మేరకు కొనుగోలు చేశారనేదానిపై నిర్వాహకులను అడిగితెలుసుకున్నారు. నిబంధనలు ప్రకారం ధాన్యం తూకం వేయాలని, రైతులకు కేంద్రాల్లో ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. రైతులకు ఎప్పటికప్పుడూ గన్నీ బ్యాగుల కొరత రానివ్వకుండా అందుబాటులో ఉంచాలన్నారు. రైతులతో వరి పంటసాగు, దిగుబడులపై కలెక్టర్ చర్చించారు. మండల ప్రత్యేకాధికారి మోహన్ బాబు, తహసీల్దార్ వై.వెంకటేష్, ఏవో ఎస్.అనిత, పద్మారావు, నవీన్‌కుమార్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

వికారాబాద్: అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు.శుక్రవారం కలెక్టరేట్‌లో ధరణి, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే, పాఠశాల తనిఖీలు తదితర అంశాలపై తహసీల్దారులు, ఎంపీడీవోలు, ఎంఈఓలు, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించే క్రమంలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి పరిష్కరించాలన్నారు. వసతి గృహాలు, పాఠశాలలో నాణ్యమైన భోజనాన్ని అందించాలని తెలిపారు. సర్వేను వేగవంతం చేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది కలగకుండా, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ధాన్యాన్ని సేకరించాలని సూచించారు.

గోవులను తరలిస్తున్న వాహనం పట్టివేత

పెద్దేముల్, నవంబర్ 22(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా గోవులు తరలిస్తున్న వాహనం పట్టుకుని పోలీసులు కేసునమోదు చేశారు. పెద్దేముల్ ఎస్‌ఐ గిరి తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరు నుంచి జహీరాబాద్ వైపు బుధవారం అర్ధరాత్రి ఐషర్ వాహనంలో 17 గోవులు, ఐదు లేగదూడలను తరలిస్తుండగా తట్టెపల్లి వద్ద పోలీసులు పట్టుకున్నారు. వాటికి ఎలాంటి రక్షణ లేకుండా ఒకదానిపై ఒకటి పడినట్లుగా ఉంచి తరలిస్తున్నారు. అదేవిధంగా గోవులు తరలించడానికి వాహనదారుడి వద్ద ఎలాంటి అనుమతి పత్రాలూ లేవు. దీంతో వాహనాన్ని పెద్దేముల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గోవులు తరలిస్తున్న కోహీర్ గ్రామానికి చెందిన జైనోద్దీన్‌పై, గోవులు తరలిస్తున్న ఐషర్ వాహనంపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గిరి తెలిపారు.

మీరాలం కుంటను పరిశీలించిన 'హైడ్రా'

- వివరాలు సేకరించిన అధికారులు
- భయందోళనలో పలువురు నిర్మాణదారులు

ఘట్‌కేసర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలోని మీరాలంకుంటను శుక్రవారం హైడ్రా అధికారులు పరిశీలించారు. నాలుగు నెలల క్రితం 10వ వార్డు కౌన్సిలర్ బాలగోని వెంకటేష్ గౌడ్ కుంటలో ఆక్రమాలపై హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు కుంటను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. బతుకమ్మ ఘాట్ పేరుతో మున్సిపల్ చైర్మన్ దాదాపు రెండువేల చదరపు గజాల చెరువును పూడ్చివేశాడని అధికారులకు తెలిపారు. ఈ విషయమై పోచారం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైనట్లు తెలిపారు. కుంట అలుగులను మూసివేసి మరోచోట ఏర్పాటు చేశారని, దీంతో తమ కుటుంబసభ్యుల వ్యవసాయ భూమి మునిగిపోతున్నదని రికార్డులను పరిశీలించి అలుగును పునరుద్ధరించాలని కోరారు.


మీరాలం కుంటను పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు, పక్కన కౌన్సిలర్ వెంకటేశ్ గౌడ్

70కి పైగా పార్కుల ఆక్రమణ

లక్షల రూపాయలు వెచ్చించి చెరువుకు తూము ఏర్పాటు చేశారని దానికింద ఇళ్ల నిర్మాణం చేశారని దాంతో నీరు దిగువకు వెళ్లలేని పరిస్థితి నెలకొన్నదని హైడ్రా అధికారులకు వివరించారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలో 70కి పైగా పార్కులు ఆక్రమణలకు గురయ్యాయని పార్కు స్థలాల్లో రిజిస్ట్రేషన్లు నిలిపి వేయాలని మున్సిపల్ కమిషనర్ గతంలోనే ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ప్రధానంగా చెరువు పూడ్చివేతకు మున్సిపాలిటీ నిధులు ఎలా వినియోగించారని వివరాలు అడిగి తెలసుకున్నారు. రికార్డులను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కాగా అన్నోజిగూడలో హైడ్రా అధికారులు పర్యటించిన విషయం మున్సిపాలిటీ పరిధిలో తీవ్ర చర్చనీ అంశంగా మారింది. నాళాలు, బఫర్‌జోన్ల పరిధిలో నిర్మించిన నిర్మాణాల విషయంలో అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని పలువురు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

కృత్రిమ మేధతో ఉపయోగాలెన్నో..


కేరీర్ గైడెన్స్ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధస్సుతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని మైక్రోసిస్ లాజిక్ సంస్థ సీఈవో విజయ వీర అన్నారు. అనురాగ్ యూనివర్సిటీలో శుక్రవారం జరిగిన కేరీయర్ గైడెన్స్ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ విభాగంలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. కృత్రిమ మేధస్సుతో పనిచేసే ఎలక్ట్రానిక్ వస్తువుల ప్రాముఖ్యతను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇండస్ట్రీ అలియన్స్ సంస్థ డైరెక్టర్ సిద్ధార్థ ఘోష్, అధ్యాపకులు మంగళగౌరీ, అనిల్‌కుమార్, అభిరామ్, నాయబ్ రసూల్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బసవన్న ఆలయంలో శివలింగం అపహరణ

వినాయకుడి విగ్రహాన్ని తొలగించిన దుండగులు

షాద్‌నగర్‌రూరల్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్‌లోని పురాతన బసవన్న ఆలయంలోని శివలింగాన్ని గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి అపహరించుకుపోయారు. అలాగే ఆలయ ఆవరణలోని వినాయకుడి విగ్రహాన్ని ఉన్నచోటు నుంచి తీసి పక్కకు పడేశారు. ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, గ్రామస్తుల కథనం ప్రకారం.. సుమారు 500 ఏళ్ల కిందటి ఆలయంలో రోజు మాదిరిగానే పూజారి అమర్‌నాథ్ శుక్రవారం ఉదయం పూజలు చేసేందుకు వచ్చారు. గుడిలో శివలింగం కనిపించలేదు. వినాయకుడి విగ్రహం తొలగించబడింది. దాంతో ఆందోళనకు గురైన ఆయన గ్రామస్తులకు విషయం తెలిపారు. వెంటనే అక్కడికి చేరుకున్న హిందూ సంఘాల నాయకులు, గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. వెంటనే నిందితులను పట్టుకుని శిక్షించాలని డిమాండ్ చేశారు. సమాచారం తెలుసుకున్న ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ అక్కడికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఆయన తెలిపారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్

పూడూరు పీహెచ్‌సీ తనిఖీ



ఆస్పత్రిలో మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

పూడూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పూడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీహెచ్‌ఎంవో డాక్టర్ వెంకటరమణ శుక్రవారం తనిఖీ చేశారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి రేణుకుమార్, సమన్వయకర్త మహేశ్, డీపీవోతో కలిసి ఆసుపత్రిలో అన్ని విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రిలో రికార్డులు, అటెండెన్స్ రిజిస్టర్లు, ఇన్‌పేషంట్లు, ఔట్ పేషంట్లు, ప్రసవగది, ఏఎన్‌సీ చెకప్ గదిని పరిశీలించి అక్కడున్న మందులను, వాటి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే అక్కడున్న లాబరోటరీ, అంబులెన్స్, వ్యాక్సిన్ గదిని సైతం తనిఖీ చేశారు. అనంతరం వైద్యాధికారి, ఎంఎల్‌హెచ్‌పీ, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలులతో వ్యాధినిరోధక టీకాలు, ప్రసవాలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, వ్యాక్సినేషన్, ఎంసీహెచ్ కార్యక్రమాలపై ఆయన సమీక్షించారు.

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి



చేవెళ్లలో మాట్లాడుతున్న రామస్వామి

చేవెళ్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రోజురోజుకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి, జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణచారి డిమాండ్ చేశారు. శుక్రవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని సీపీఐ కాలనీ-2లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వాలు మారినా కార్మికుల జీవితాలు మారడం లేదన్నారు. మార్కెట్‌లో నిత్యవసర వస్తువుల ధరలు నిత్యం పెరుగుతున్నా.. కార్మికుల జీతాలు మాత్రం పెరగడం లేదన్నారు. 2010 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు వేతన సవరణ చట్టం అమలు చేయడం లేదన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలో కొత్తకొత్త కంపెనీలు పుట్టుకువస్తున్నా.. స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులను తీసుకొని తక్కువ జీతాలు ఇచ్చి పనులు చేయించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి కార్మికుడికి నెల వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి డప్పు శివయ్య, కార్యవర్గ సభ్యులు మంజుల, మీనాక్షి, పద్మ, లలిత, రాంచందర్, శ్రీను, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

బలవంతపు భూసేకరణ తగదు



లగచర్ల బాధితులతో మాట్లాడుతున్న అరుణజ్యోతి, మల్లులక్ష్మి

బొంరాస్‌పేట్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): లగచర్లలో ఫార్మా కారిడార్ పేరుతో రైతుల నుంచి బలవంతంగా భూ సేకరణ చేయడం సరైంది కాదని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి, కార్యదర్శి మల్లులక్ష్మి అన్నారు. శుక్రవారం వారు లగచర్ల, రోటిబండ తండా, పోలెపల్లి, హకీంపేట్, పులిచర్లకుంట తండాలో పర్యటించారు. భూములు కోల్పోతున్న బాధిత రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం రైతుల పట్టా భూములైతే 80 శాతం, ప్రభుత్వ భూమి అయితే 70 శాతం రైతులు ఒప్పకుంటే ముందస్తుగా పరిహారం చెల్లించి సేకరించాలన్నారు. ఫార్మా కంపెనీ పేరుతో 1,273 ఎకరాల భూ సేకరణ కోసం జిల్లా అధికారులు లగచర్లకు వెళ్లడంతో ఈ దాడి జరిగిందని, ఈ ఘటనలో అరెస్టయిన బాధిత కుటుంబాలను వారు పరామర్శించి మనోధైర్యం కల్పించామన్నారు. అందరు కలిసికట్టుగా ఉంటే ఫార్మా కారిడార్ ఏర్పాటు రద్దయ్యేంత వరకు వెంట ఉంటామన్నారు. అక్రమంగా అరెస్టయిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా సహాయ కార్యదర్శి ఆశాలత, జిల్లా కార్యదర్శి అనసూయ తదితరులు పాల్గొన్నారు.

25న సామూహిక బిల్వార్చన

కులకచర్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 25వ తేదీన సామూహిక బిల్వార్చన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు దేవాలయ ఈవో సుధాకర్ తెలిపారు. ఆయన శుక్రవారం దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా పాంబండపై ప్రత్యేక పూజా కార్యక్రమంలో భాగంగా సామూహిక లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10గంటలకు పూజ ప్రారంభమవుతుందన్నారు. పూజలో పాల్గొనే భక్తులు ముందుగా రూ.250 చెల్లించాలని, పూజా సామగ్రి ప్లేట్, గ్లాసు వారే తెచ్చుకోవాలని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

కోనోకార్పస్‌తో ముప్పు!

పిట్ట వాలని చెట్లతో ప్రాణాంతకం

- పర్యావరణానికి పెనుముప్పు
- పుప్పొడితో అలర్జీ, శ్వాసకోశ వ్యాధులు
- చేవెళ్ల మండలంలో ఏపుగా పెరిగిన మొక్కలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



చేవెళ్లలో రోడ్డు పక్కన భారీగా పెరిగిన కోనోకార్పస్ మొక్కలు

చేవెళ్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణాలు, గ్రామాల సుందరీకరణలో భాగంగా గత ప్రభుత్వం హయాంలో నాటిన కోనోకార్పస్ మొక్కలు పర్యావరణానికి పెను ముప్పుగా మారాయి. శ్వాసకోశ సంబంధిత వ్యాధులకు కారణమవుతున్న ఈ మొక్కలను తొలగించాలని పర్యావరణవేత్తలు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు అక్కడక్కడా తొలగించి చేతులు దులుపుకున్నారు. ఏపుగా పెరుగుతున్న ఈ మొక్కలు వాటి పరిసరాలల్లో మరే మొక్కను పెరగనివ్వకుండా పర్యావరణానికి హానీ కలిగిస్తుంది. మనుషులతో పాటు జంతువులకు కూడా హానీ కలిగిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ చెట్లమీద ఒక పిట్ట కూడా వాలడం లేదంటే పర్యావరణానికి ఇవి ఎంత హానీకరమో ఇట్టే అర్థమవుతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే కోనోకార్పస్ మొక్కలను తొలగించాలని కోరుతున్నారు.

అన్నిగ్రామాల్లో ఇదే పరిస్థితి

చేవెళ్ల డివిజన్ పరిధిలో మొత్తం 132 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో పచ్చదనం- పరిశుభ్రత, హరితహారం కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వం కోనోకార్పస్ ఒక్కో మొక్కను రూ.50 వెచ్చించి మరీ కొనుగోలు చేసి నాటించారు. వారాల వ్యవధిలో ఈ మొక్కలు విపరీతంగా పెరిగి వేర్లు కూడా భూమిలోకి లోతుగా వెళ్లి వాటి పరిసరాల్లో మరే మొక్కను పెరగనివ్వకుండా చేస్తున్నాయి. దీంతో గ్రామాల్లోకి వెళ్లే రోడ్ల వెంబడి, ప్రధాన రోడ్ల వెంబడి ఏపుగా పెరిగిన కోనోకార్పస్ మొక్కలు దర్శనమిస్తున్నాయి.

చూడడానికి ఆహ్లాదంగానే.. కానీ

పచ్చదనంతో నిండుకుని ఉన్న ఈ చెట్లను చూస్తే ఆహ్లాదకరంగానే ఉంటుంది. కానీ మొక్కలు పూతకు వచ్చినప్పుడే అత్యంత ప్రమాదకరంగా మారుతోంది. ఈ మొక్కల నుంచి వెలువడే పుప్పొడి రేణువుల వల్ల మనుషుల్లో అలర్జీ, శ్వాసకోశ వ్యాధులు, ఆస్తమా వంటి జబ్బులు రావడమే కాకుండా చివరి వరకు అది కేన్సర్‌కు దారి తీసే అవకాశం ఉందని శాస్త్రవేత్తల పరిశోధనలో తేలింది. దీంతో ఈ మొక్కలను తొలగించాలని గత ప్రభుత్వ హయాంలోనే అధికారులు తీర్మానం చేసినప్పటికీ అక్కడక్కడా రోడ్డు పక్కన తొలగించారు. కానీ గ్రామాల్లో ఉన్న చెట్లను మాత్రం అలాగే వదిలేశారు. పలు పంచాయతీల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాల్లో ఈ మొక్కలే ప్రధానంగా కనిపిస్తున్నాయి. ఈ చెట్ల వలన పక్షులు, జంతువులకు కూడా ఎటువంటి ఉపయోగం లేదు. జంతువులు ఈ ఆకులను తినవు.. ఏ పక్షీ ఈ చెట్టుపై గూడుకట్టదు. దీనికితోడు రోడ్డు పక్కన, ప్రధాన రోడ్డు మధ్యలో నాటిన ఈ మొక్కల వేళ్లు భూమిలోకి లోతుగా పాతుకుపోయి అడ్డువచ్చే కేబుల్ వైర్లు, వాటర్ పైప్‌లైన్లను ధ్వంసం చేస్తున్నాయి. ఇప్పటికైనా మొక్కలు తొలగించి పర్యావరణానికి హానీ కలిగించే మొక్కల నుంచి ప్రజలకు, జంతువులకు, రక్షణ కల్పించాలని పలువురు కోరుతున్నారు.

ప్రజాప్రతినిధులు స్పందించాలి



కోనోకార్పస్ మొక్కలు చాలా గ్రామాల్లో నాటారు. నిత్యం ప్రజలు ఈ మొక్కల పక్క నుంచి వెళ్తున్నారు. మొక్కలు ప్రాణాంతకమని తెలిసినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఇకానైనా స్పందించి వాటిని తొలగించి నీడనిచ్చే ఇతర మొక్కలు, లేదా పండ్ల మొక్కలు నాటాలి. - రామకృష్ణరావు, పర్యావరణ అవార్డు గ్రహీత, చేవెళ్ల

వెంటనే తొలగించాలి



పచ్చదనం పేరుతో నాటిన మొక్కల్లో సగం వరకు కోనోకార్పస్ మొక్కలే ఉన్నాయి. ఎక్కడ చూసినా రోడ్డు వెంట ఈ మొక్కలే దర్శనం ఇస్తున్నాయి. ఉన్నతాధికారులు, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే తొలగించాలి. వాటి స్థానంలో ఇతర మానవాళికి ఉపయోగపడే మొక్కలు నాటాలి. - డాక్టర్, వైభవ్‌రెడ్డి, బీజేపీ నాయుడు, చేవెళ్ల



అగ్గనూరు స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్



దేవనూరులో రైతులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

యాలాలలో ఉన్నతాధికారుల పర్యటన

ఒకే రోజు ముగ్గురు జిల్లా అధికారుల కార్యక్రమాలు



అక్కంపల్లి కొనుగోలు కేంద్రం వద్ద మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ ఉమాశంకర్

యాలాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): యాలాల మండల కేంద్రంలో శుక్రవారం ఒకేరోజు ముగ్గురు జిల్లాస్థాయి అధికారులు పర్యటించారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్, అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ పలు గ్రామాల్లో పర్యటించారు. కలెక్టర్ మండల పరిధిలోని అగ్గనూరు జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం విషయం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ దేవనూరులో ధాన్యం కేంద్రాలను సందర్శించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ అక్కంపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం స్థానిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఒకేరోజు కలెక్టర్‌తోపాటు అడిషనల్ కలెక్టర్, సబ్ కలెక్టర్ పర్యటించడంతో అన్ని శాఖల అధికారులు ఆశ్చర్యపోయారు. వారి వెంట తహసీల్దార్ అంజయ్య, ఎంఈవో సుధాకర్, ఆర్‌ఐలు శరణ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా కొప్పుల!



షాద్‌నగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా కొప్పుల మహేందర్ రెడ్డి నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని నేడో రేపో అధికారంగా ప్రకటించనున్నారు. షాద్‌నగర్ పట్టణానికి చెందిన ఆయన ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగి ఉద్యోగ విరమణ చేశారు. అనంతరం ఆయన న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు. అలాగే షాద్‌నగర్ రెడ్డి సేవా సంఘం తాలుక అధ్యక్షుడుగా బాధ్యతలు నిర్వహిస్తూ పేద రెడ్డి వర్గాల సమగ్రాభివృద్ధికి కృషి చేశారు. ఉపాధ్యాయ, న్యాయవాద వృత్తిలో అపార అనుభవం ఉండటంతో ఆయనకు ఈ పదవి లభించడం హర్షణీయమని పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన అభినందనీయం



ప్రహ్లాద్‌రావుకు ఫొటో అందిస్తున్న ఉత్తమ్

కులకచర్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పిండం అభినందనీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావు తెలిపారు. స్థానిక వీఎస్ ఎంటర్ ప్రైజెస్ నిర్వాహకులు తిరుమలాపూర్ వాస్తవ్యులు సాయిభరత్‌కుమార్, ఉత్తమ్‌కుమార్‌లు ప్లాస్టిక్ నిషేధంపై ప్రచారం చేస్తున్నారు. శుక్రవారం కులకచర్లలో బీజేపీ కార్యాలయంలో ప్రహ్లాద్‌ను కలిసి ఆర్గానిక్ వస్తువులతో తయారు చేసిన ఆయన ఫొటోను అందించారు. ఈ సందర్భంగా ప్రహ్లాద్‌రావు మాట్లాడారు. ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణ పరిరక్షణకు యువకులు చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జానకిరామ్, వెంకటయ్యగౌడ్, మైపాల్, చంద్రలింగం, సురేశ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా శక్తి సంబురాలు



పాస్‌బుక్స్ అందజేస్తున్న ఏపీఎం

తలకొండపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా శక్తి సంబురాలు జరుపుకున్నారు. సంఘాలలో కొత్తగా చేరిన సభ్యులకు పాసుబుక్ లను అందజేశారు. మహిళా శక్తి వారోత్సవాల్లో భాగంగా కొత్తగా సభ్యులను చేర్పిస్తున్నట్లు ఏపీఎం శ్రీదేవి తెలిపారు. మహిళలు సంఘటితంగా ముందుకు సాగి తమ శక్తిని చాటాలని ఆమె కోరారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు కార్యక్రమంలో సీసీలు దీప, రాములు, విజయలక్ష్మి, సత్యం, లక్ష్మయ్య, వీవోఏ పాల్గొన్నారు.

సెల్ఫీ వీడియో తీసుకొని యువకుడు ఆత్మహత్యకు యత్నం

కుటుంబీకుల ఫిర్యాదుతో కాపాడిన పోలీసులు



నర్సింహగౌడ్‌తో ఎస్‌ఐ వెంకటేశ్

ఆమనగల్లు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య చేసుకొని చనిపోతున్నానని ఓ యువకుడు సెల్‌ఫోన్‌లో సెల్ఫీ వీడియో తీసుకొని కుటుంబ సభ్యులకు పంపించిన యువకుడిని ఆమనగల్లు పోలీసులు కాపాడారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం ఈ సంఘటన చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని చంపాపేటకు చెందిన నర్సింహగౌడ్ ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది ఇంట్లో చెప్పకుండ బయటకు వెళ్లాడు. విఠాయిపల్లి గ్రామ సమీపంలోని ఓ వెంచర్‌లో కూర్చొని తాను చనిపోతున్నానని సెల్ఫీ వీడియో తీసుకొని కుటుంబ సభ్యులకు పంపాడు. ఆందోళనకు లోనైన అతని భార్య, కుటుంబ సభ్యులు రాచకొండ కమిషనరేట్‌లో ఫిర్యాదు చేశారు. నర్సింహ మొబైల్ లోకేషన్‌ను ట్రెస్ చేయగా విఠాయిపల్లి లోని ఓ వెంచర్‌లో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు ఆమనగల్లు పీఎస్‌కు సమాచారం అందించారు. దీంతో ఎస్‌ఐ వెంకటేశ్, పోలీసు సిబ్బందితో వెంటనే అక్కడికి చేరుకొని నర్సింహగౌడ్‌ను గుర్తించి పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం అతన్ని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. లోకేషన్ ఆధారంగా వెంటనే అప్రమత్తమై యువకుడిని కాపాడిన పోలీసు సిబ్బంది మల్లేశ్, రఘునాయక్, ఎస్‌ఐ వెంకటేశ్ లను సీఐ ప్రమోద్ కుమార్ అభినందించారు.

రక్తదానంపై అపోహలు వీడాలి



రక్తదాన శిబిరంలో గోలి శ్రీనివాస్ రెడ్డి

కడ్తాల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రక్తదాతలు ప్రాణదాతలుగా నిలుస్తారని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రక్తదానంపై ప్రజలు అపోహలు వీడాలని ఆయన కోరారు. కడ్తాల మండల కేంద్రంలో శుక్రవారం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తుప్పరి రాజు, సిద్ధిగారిమహేశ్ ల జ్ఞాపకార్థం వారి స్నేహితులు, కుటుంబ సభ్యులు రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని మాజీ జెడ్పీటీసీ దశరథ్ నాయక్ ప్రారంభించారు. కార్యక్రమానికి గోలి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిబిరంలో 85 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కోల్పోయిన స్నేహితుల జ్ఞాపకార్థం రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో సీఐ శివప్రసాద్, ఎస్‌ఐ వరప్రసాద్, తహసీల్దార్ ముంతాజ్, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మీనర్సింహారెడ్డి , ఎర్రోళ్ల రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

నిధులున్నా.. నిర్లక్ష్యం!

(5వ పేజీ తరువాయి)

వహించే నియోజకవర్గాల కోసం ఖర్చు చేసేందుకు వీలుగా ఏడాదిలో రెండుసార్లు రూ. 5 కోట్ల మొత్తాన్ని ఇస్తున్నారు. ఈ నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టొచ్చు. కానీ.. ఉన్న నిధులు పూర్తి స్థాయిలో ఖర్చుచేయలేక పోతున్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో ఈ పరిస్థితి నెలకొంది. ఎంపీ నిధులతో వివిధ అభివృద్ధి పనులు ప్రతిపాదనలు, శంకుస్థాపనలకే పరిమితమవుతున్నాయి. రంగారెడ్డి జిల్లాకు ఇతర ఎంపీలు ఇచ్చిన నిధులు కూడా వినియోగించుకోలేక పోవడం విడ్డూరంగా ఉంది. పట్టించుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇదీ పరిస్థితి..!

2019-20, 2023-24 వరకు చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో కేంద్ర ప్రభుత్వం రూ.17 కోట్లు మంజూరు చేసింది. అప్పటి ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి జిల్లాలో రూ. 1567.28 లక్షలు అంచనా వ్యయంతో 286 పనులకు శంకుస్థాపనలు చేశారు. ఆయన పదవీ కాలం పూర్తయింది. కానీ.. ఇప్పటి వరకు 108 పనులు పూర్తి చేశారు. రూ. 564.12 లక్షలు ఖర్చుపెట్టారు. ఇంకా 181 పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. ఇంకా రూ. 972.97 లక్షలు ఖర్చు పెట్టాల్సి ఉంది. వీటితో పాటు రంగారెడ్డి జిల్లాకు ఇతర ఎంపీలు ఇచ్చిన నిధుల ఖర్చులో కూడ నిర్లక్ష్యం నిండుకుంది. మల్కాజిగిరి ఎంపీ రేవంత్‌రెడ్డి కోటి రూపాయలతో 23 పనులను చేపట్టగా, అందులో 15 పనులు మాత్రమే పూర్తి చేశారు. దీనికి గాను రూ.58.927 లక్షలు ఖర్చు పెట్టారు. ఇంకా రూ. 41.999 లక్షలు ఖర్చు చేయాల్సి ఉంది. అలాగే భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రూ.97.99 లక్షలతో 75 పనులు మంజూరు చేశారు. అందులో 36 పనులు పూర్తిచేసి రూ. 46.499 లక్షలు ఖర్చు పెట్టారు. ఇంకా 37 పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఇందుకు గాను రూ. 51.50 లక్షలు ఖర్చు చేయాలి. నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు రూ. 156.65 లక్షల అంచనాతో 40 పనులు మంజూరు చేశారు. అందులో 29 పనులు పూర్తి కాగా, రూ. 92.530 ఖర్చు చేశారు. ఇంకా 11 పనులు పూర్తి చేయడానికి రూ.59.00 లక్షలు ఖర్చు చేయాల్సి ఉంది. మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి రూ.139.50 లక్షల అంచనాతో 33 పనులు మంజూరు చేశారు. అందులో 11 పనులు పూర్తి చేసి రూ. 36.531 లక్షలు ఖర్చు పెట్టారు. ఇంకా 22 పనులకు 98.50 లక్షలు ఖర్చు చేయాల్సి ఉంది.

చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో ఎంపీ నిధుల వివరాలు

సంవత్సరం	మంజూరైన పనులు	అంచనా వ్యయం (రూ.లక్షల్లో)	పూర్తయిన పనుల సంఖ్య	ఖర్చు చేసిన వ్యయం (రూ.లక్షల్లో)	నిలిచిపోయిన పనుల సంఖ్య	ఖర్చు చేయాల్సిన నిధులు (రూ.లక్షల్లో)
2019-20	90	475.82	79	401.01	11	55.91
2020-21	0	0	0	0	0	0
2021-22	23	196.00	09	80.00	12	75.00
2022-23	93	486.60	08	33.53	80	422.10
2023-24	92	489.96	12	49.57	78	419.96
మొత్తం	286	1567.28	108	564.12	181	972.97

'ఉపాధి'లో జల సంరక్షణకు ప్రాధాన్యం

- గతంలో ఉపాధే లక్ష్యంగా పనులు
- జలసంరక్షణ పనులపై ప్రభుత్వం దృష్టి
- ఉపాధి హామీ పనులతో ప్రయోజనం చేకూర్చే దిశగా చర్యలు


నవాల్గలోని గ్రామసభలో జల సంరక్షణ ప్రాధాన్యతను వివరిస్తున్న ఈసీ నరసింహారెడ్డి(ఫైల్)

బషీరాబాద్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో ప్రతీ సంవత్సరం అనేక రకాల పనులు సాదాసీదాగా చేపడుతున్నాయి. అయితే కేవలం కూలీలకు ఉపాధి కల్పించేలా పథకం పనులు కొనసాగుతున్నాయే గానీ వాటితో ప్రజలకు ఎలాంటి ప్రయోజనం చేకూరడంలేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ క్రమంలో దీర్ఘకాలిక ప్రయోజనాలు అందించేలా కేంద్ర ప్రభుత్వం ఈసారి ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగానే జల సంరక్షణకు చర్యలు చేపట్టింది. వర్షపు నీటిని ఒడిసిపట్టేలా వచ్చే ఆర్థిక ఏడాది నుంచి ఈ పనులు చేపట్టనుంది. ఈ మేరకు వచ్చే బడ్జెట్‌లో జల సంరక్షణ పనులకు మొదటి ప్రాధాన్యం ఇస్తూ నిధులు కేటాయించనున్నారు. గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధిహామీ గ్రామ సభల్లో జలసంరక్షణ ప్రాధాన్యతపై అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే..

ప్రస్తుతం ఉపాధి పథకంలో ముళ్లపొదల తొలగింపు పనులు, నర్సరీల్లో మొక్కల పెంపకం, నాటడం వంటి పనులే అధికంగా చేపడుతున్నారు అయితే ఈ పనుల వలన కేవలం కూలీలకు ఉపాధి మాత్రమే కల్పించగలిగారు. పథకం ఆరంభంలో చెరువుల్లో పూడికతీత, కందకాలు, వ్యవసాయ పొలాల్లో చెక్‌డ్యాం వంటి పనులు చేపట్టారు. అప్పట్లో ఇందిర జలప్రభ, జలశక్తి అభియాన్ పథకాలను చేపట్టినా వందశాతం అమలు కాలేదు. ఏటా రూ.కోట్లు ఖర్చుచేసినా అవసరమైన జల సంరక్షణ పనులు చేపట్టలేకపోయారు. అయితే ఈసారి ఉపాధిహామీ పథకంలో జలసరంక్షణలో ప్రజల భాగస్వామ్యం అనే నినాదం కేంద్రం తీసుకొస్తోంది. వచ్చే ఏడాది చేపట్టే ఉపాధి పథకంలో ప్రజలను భాగస్వామ్యం చేయాలని నిర్ణయించినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు ప్రస్తుతం నిర్వహిస్తున్న ఉపాధిహామీ గ్రామసభల్లో వీటిపై చర్చిస్తున్నారు. ఇందులో ప్రజలను భాగస్వాములను చేయడానికి ఉపాధి హామీ అధికార, సిబ్బంది ప్రణాళికలు రూపొందిస్తున్నారు. గ్రామీణాభివృద్ధి అధికారులు సైతం అమలుకు చర్యలు చేపడుతున్నారు.

జల సంరక్షణలో చేపట్టే పనులు

చేతి పంపుల వద్ద సామూహిక, వ్యక్తి గత (ఇళ్ల దగ్గర) ఇంకుడు గుంతలు తీస్తారు. ఇంటిపై భాగంలో నిలిచిన వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా (రూఫ్‌టాప్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్) వంటి చర్యలు చేపడతారు. సాగునీటి కాల్వలు సరిచేస్తారు. అవసరమైన చోట నీటికుంటలు, ఊట కుంటలు, మట్టి కట్టలు వంటి నిర్మాణం చేపడతారు.

బాధిత గిరిజనులకు న్యాయం చేయాలి


కులకచర్లలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కులకచర్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనలో హింసకు గురైన గిరిజన రైతులకు న్యాయం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావు, జిల్లా దిశ అడ్వయిజరీ కమిటీ మెంబర్ జానకీరామ్ అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో శుక్రవారం వారు మాట్లాడారు. లగచర్ల ఘటనతో గిరిజన రైతులను బలి చేస్తున్నారని, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు పూర్తి నివేదిక అందించాలని డిమాండ్ చేశారు. అమాయక గిరిజన రైతులపై వేధింపులు ఆపాలన్నారు. గిరిజన రైతుల సాగు భూములను స్వాధీనం చేసుకుంటే వారు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ఫార్మా కంపెనీలు పడావు భూముల్లో ఏర్పాటు చేయొచ్చన్నారు. కాంగ్రెస్ పార్టీ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం అమాయక గిరిజన తండావాసులను జైలులో వేయడంతో వారి కుటుంబసభ్యులు భయభ్రాంతులకు గురవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా కలెక్టర్, ఎస్పీ వెంటనే స్పందించి అమాయక గిరిజనులను విడుదల చేయాలన్నారు లేదంటే బీజేపీ తరఫున పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టెలికాం అడ్వయిజరీ మెంబర్ గణపూరం వెంకటయ్యగౌడ్, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు, మాజీ సర్పంచ్ సౌమ్య వెంకట్రామ్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు గాదె మహిపాల్ ముదిరాజ్, పార్టీ మండల అధ్యక్షుడు జెమిని సూర్యకాంత్, సీనియర్ నాయకులు సీహెచ్.చంద్రలింగం, సురేందర్‌గౌడ్, బోయిని భీమయ్య, మండల ప్రధాన కార్యదర్శి గుడాల వెంకటేశ్, గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు మహేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ


స్వయం పరిపాలనలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

కులకచర్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పాయిపల్లి గేటు (తిరుమలాపూర్) దగ్గర గల పంచవటి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈవో, ఎంఈవో, హెచ్‌ఎంగా విద్యార్థులు వ్యవహరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ రవికుమార్ బహుమతులు అందజేశారు.


స్వయం పరిపాలనలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

బషీరాబాద్: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల(బాలికలు)లో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీపీ కరుణఅజయ్‌ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తరగతి గదిలో తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎంపీపీ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం హీర్యానాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పలువురు పాల్గొన్నారు.

ఎస్‌టీవోపై చర్యలు తీసుకోవాలి


డీటీవోకు ఫిర్యాదు చేస్తున్న వెంకటరత్నం

వికారాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2024ద్వారా కొత్తగా నియామకమైన ఉపాధ్యాయుల నుంచి కొడంగల్ ఎస్‌టీవోపై శాఖపరమైన చర్యలుతీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ వికారాబాద్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటరత్నం, ఎరాములు జిల్లా ఖజానా అధికారి (డీటీవో)కు ఫిర్యాదు చేశారు. కొడంగల్ ఎస్‌టీవో పరిధిలోని దౌల్తాబాద్, కొడంగల్, బొంరాస్‌పేట్, దుద్యాల మండలాల్లో ఉపాధ్యాయుల నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.800 నుంచి రూ.1000 వరకు ఎస్‌టీవో వసూలు చేస్తున్నారని ఆరోపించారు. డీటీవోకు ఫిర్యాదు చేసిన వారిలో యూటీఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు బసప్ప, శీను ఉన్నారు.

న్యూస్ బాక్స్

పరిగి ఏఎంసీ చైర్మన్‌గా పరశురాంరెడ్డి


పరశురాంరెడ్డి

పరిగి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పరిగి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బి.పరశురాంరెడ్డి(సయ్యద్‌పల్లి), వైఎస్ చైర్మన్‌గా సయ్యద్‌అయూబ్‌హుస్సేన్(పరిగి), డైరెక్టర్లుగా టి.వీరేశం(మంచన్‌పల్లి), ఎ.రాజవంశీ(పెద్దఉమ్మెంతాల్), కె.రమేశ్(పూడూరు), కౌకుంట రమేశ్(అంగడిచిట్టెంపల్లి), పి.రవినాయక్(సోండేపూర్), ఎం.శశికళ(నస్కల్), పి.ప్రభాకర్‌రెడ్డి(గుండాల్), డి.శాంతకుమార్(ఖమ్మంనాచారం), ఎం.బందెయ్య(దిర్సంపల్లి), ఏదుల నర్సింహులు(కిష్టాపూర్), ఎం.సంగయ్య(ట్రేడర్), కె.శివారెడ్డి(ట్రేడర్), కె.శ్యాంసుందర్‌రెడ్డి(పిఏసీఎస్‌చైర్మన్, పరిగి), సారంగపాని(డీఎంవో), లక్ష్మీకుమారి(ఏడీఏ,పరిగి), ఎం.అశోక్(మునిసిపల్ చైర్మన్, పరిగి)లు డైరెక్టర్లుగా నియమితులయ్యారు.

ఆటో స్టాండ్‌కు స్థలాన్ని కేటాయించాలి


వినతిపత్రం అందజేస్తున్న ఆటోయూనియన్ నాయకులు

మేడ్చల్ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పట్టణంలో ప్రత్యేకంగా తమకు ఆటోస్టాండ్ ఏర్పాటు చేసుకోవడానికి స్థలాన్ని కేటాయించాలని పలువురు ఆటో యూనియన్ నేతలు కోరారు. ఈమేరకు యూనియన్ నాయకులు శుక్రవారం మేడ్చల్ కమిషనర్ నాగిరెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. రోడ్డు విస్తరణలో భాగంగా అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని వివేకానంద చౌరస్తావద్ద గల కేసీఆర్ పార్కు వద్దకు తరలిస్తున్నందున అంబేడ్కర్ ఆటోస్టాండ్‌ను కేసీఆర్ పార్కు వద్ద ఏర్పాటు చేసుకునే విధంగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

జూనియర్ లెక్చరర్‌గా ఎంపిక


భోజ్యానాయక్

మోమిన్‌పేట్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకులపల్లి (ముక్తతండా)కు చెందిన భోజ్యానాయక్ తెలంగాణ రాష్ట్రంలో మల్టీ జోన్‌సెకండ్‌లో నాలుగవ ర్యాంకు సాధించి ఎస్టీ కోటాలో జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యాడు. భోజ్యానాయక్ టేకులపల్లిలోని ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదివి ఇంటర్ ప్రైవేట్ కళాశాలలో, డిగ్రీ సదాశివపేట్, ఎమ్మెస్సీ ప్రభుత్వ మహాత్మాగాంధీ యూనివర్సిటీ నల్గొండలో పూర్తి చేశాడు. పట్టుదలతో జూనియర్ లెక్చరర్ సాధించాలనే ఉద్దేశంతో ఢిల్లీలో కోచింగ్ తీసుకున్నాడు. జూనియర్ లెక్చరర్‌గా ఎంపికైన సందర్భంగా భోజ్యానాయక్‌ను ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు. తమ కుమారుడు ఉద్యోగం సాధించడం పట్ల వారి తల్లిదండ్రులు సోనిబాయి, వర్త్య సర్దార్ సంతోషం వ్యక్తం చేశారు.

నేడు భగవాన్ సత్యసాయి జయంతి

వికారాబాద్,నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వికారాబాద్‌లోని శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో భగవాన్ సత్యసాయి 99వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించనున్నారు. గంగారం మార్గంలో జ్ఞానకేంద్రంలో ఈ వేడుకలు జరుగనున్నాయని జ్ఞానకేంద్రం నిర్వాహకులు డాక్టర్ సత్యనారాయణగౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

క్రైం కార్నర్

పాముకాటుతో బాలిక మృతి


బాలిక మృతదేహం

తాండూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పాముకాటుతో ఓ బాలిక మృతిచెందిన ఘటన యాలాల మండలం గంగసాగర్‌లో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని గంగసాగర్ గ్రామానికి చెందిన ఓఆరేళ్ల బాలిక ఇంటి వద్ద ఆడుకుంటుండగా, పక్కనే సంచుల మధ్య మాటేసిన పాము బాలికను కాటేసింది. గమనించిన బాలిక తనకేదో గుచ్చుకుందని, రక్తం వస్తోందని చెబుతూ తల్లిదండ్రులకు చెప్పింది. నీళ్లు తాగించడంతో, కొద్దిసేపటి తర్వాత అపస్మారక స్థితికి చేరుకొని మృతి చెందింది. బాలిక మృతితో పాముకాటుకు గురైనట్లు అనుమానించిన స్థానిక ఇళ్ల ప్రజలు పామును పట్టి చంపేశారు. తన కూతురు కళ్ల ఎదుటే మృతిచెందడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఇద్దరు దొంగల రిమాండ్


పోలీసుల అదుపులో రాజు, చారి

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆలయంలో చోరీకి పాల్పడిన ఇద్దరు దొంగలను పోచారం ఐటీ కారిడార్ పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. పోచారం మున్సిపల్ పరిధి ఫకీర్‌టెక్యా తండాలోని ఎల్లమ్మ ఆలయంలో ఇద్దరు నిందితులు అమ్మవారి 5గ్రాముల బంగారు పుస్తె, 5గ్రాముల వెండి కళ్లను ఎత్తుకెళ్లారు. ఆలయ పూజారి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు సీసీపుటేజీలను పరిశీలించారు. తండావాసులతో మాట్లాడి వివరాలు సేకరించారు. యాక్టీవాపై వచ్చి ఇద్దరు నిందితులు ఆలయంలో చోరీకి పాల్పడినట్లు నిర్ధారించుకున్నారు. అనంతరం సీసీపుటేజీలో చిక్కిన ఆధారాల మేరకు కీసర రాజీవ్‌గృహకల్పకు చెందిన పెండెం రాజు(39), కొండోజు చారి(51)గా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకొని రాజు, చారిలను రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోచారం ఐటీ కారిడార్ పోలీసులు తెలిపారు.

బీటీ రోడ్డు తనిఖీ


బీటీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న అధికారులు

దౌల్తాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తిమ్మారెడ్డిపల్లి గ్రామ పంచాయతీ నుంచి నాగసార్, బంగ్లా తండా మీదుగా తిరుమలాపూర్ వరకు సీఆర్ఆర్ నిధులు రూ.907.75లక్షలతో చేపట్టిన బీటీరోడ్డు పనులను క్వాలిటీ కంట్రోల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంజీవరెడ్డి, తాండూర్ డిప్యూటీ ఈఈ సంతోష్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు పనులను నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని డిప్యూటీ డీఈ సంజీవరావుకు ఆదేశించారు. ఈసందర్భంగా పంచాయతీరాజ్ ఏఈలు రవికిరణ్, నాగేంద్ర ఉన్నారు.

క్రీడలతో శారీరక దారుఢ్యం


కబడ్డీ టోర్నమెంట్‌లో క్రీడాకారులతో ఎస్ఐ రవిగౌడ్, నాయకులు

దౌల్తాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని ఎస్ఐ రవిగౌడ్ అన్నారు. మండలంలోని చల్లాపూర్‌లో మహిబూబ్‌సుభానీ దర్గా ఉర్సు సందర్భంగా గ్రామ యువకుల ఆధ్వర్యంలో శుక్రవారం కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభించారు. పోటీల్లో క్రీడాకారులకు మొదటి బహుమతిగా రూ.10వేలు, ద్వితీయ బహుమతిగా రూ.5వేలు, తృతీయ బహుమతిగా రూ.2500 అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ చెన్నారం నర్సింహులు, ప్రజాప్రతినిధులు వెంకట్రావ్, వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, వెంకట్రాములు, లింగప్ప, శరణయ్య, పకీరప్ప, హనుమంతు పాల్గొన్నారు.

అసభ్యకరంగా ప్రవర్తిస్తే షీటీంను సంప్రదించాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీం అధికారులు

పెద్దేముల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మహిళలపట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, వెకిలిచేష్టలు చేసినా షీటీంను సంప్రదించాలని షీటీం సబ్‌డివిజన్ ఇన్‌చార్జి శేఖర్ అన్నారు. మండలంలోని గొట్లపల్లి సమీపంలోని తెలంగాణ మోడల్‌స్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలు, యువతులు, విద్యార్థినుల పట్ల ఎవరైనా అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించినా 100కు లేదా షీటీం నంబర్ 181కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారిపేర్లు గోప్యంగా ఉంచి వెకిలి చేష్టలు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అపరిచితులు బైక్‌పై దింపుతామన్నా ఎక్కరాదన్నారు. రోడ్డు సేఫ్టీ, ట్రాఫిక్‌రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపల్ గాయత్రి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ


ఎక్‌మామిడిలో అయ్యప్ప పడి పూజలో పాల్గొన్న మాలధారులు

వికారాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నవాబుపేట మండలం ఎక్‌మామిడి గ్రామంలో కన్నెస్వామి వెంకటేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప మహాపడి పూజ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు పెద్దఎత్తున పాల్గొన్నారు. గురుస్వామి రవిశర్మ పంతులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భజన మండలి గీతాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గురుస్వాములు నర్సింహులు, యాదయ్య, మనోహర్, సంతోష్, స్వాములు నవీన్‌గౌడ్, సురేందర్ రెడ్డి, విశ్వేశ్వర్, సంతోష్ పాల్గొన్నారు.

మీరాలం అలుగు ధ్వంసం!

(5వ పేజీ తరువాయి)

స్థానంలో ఏర్పాటు చేసిన పైపులను పలుమార్లు ధ్వంసం చేసిన సందర్భాలున్నాయి. అయినా అధికారులు మాత్రం తమకేందుకులే అన్నట్లుగా వ్యవహరిస్తుండంతో ఏళ్ల తరబడి సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సమస్యకు ప్రధాన కారణం

చెరువులు, కుంటలకు వరద నీరు వచ్చి చేరిన తర్వాత అధికంగా వచ్చేనీరు దిగువకు వెళ్లేందుకు అలుగులు ప్రధానమైనవి. కానీ మీరాలంకుంటకు గతంలో ఏర్పాటు చేసిన అలుగులు మాయమయ్యాయి. లక్షల రూపాయాలు వెచ్చించి చెరువును అభివృద్ధి చేసిన అధికారులు అలుగు(మత్తడి) నిర్మాణాన్ని మరిచిపోయారు. తాళంవేసి గొళ్లెం మరిచిన చందంగా అధికారులు. ప్రజాప్రతినిధులు ఈ ఒక్క విషయంలో మాత్రం గోప్యత పాటించడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో దాదాపు 20 ఏళ్లుగా చెరువులోని నీరు దిగువకు వెళ్లేందుకు సిమెంట్ పైపులను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. దీంతో తరచు గుర్తుతెలియని వ్యక్తులు పైపులను కిందికి దించడం, లేదా ధ్వంసం చేయాడం తరుచుగా జరుగుతున్నది. తాజాగా గత మూడు నాలుగు రోజుల క్రితం మెత్తం పైపులను ఎక్స్‌కవేటర్‌తో తొలగించి గండిపెట్టారు. దీంతో నీరంత దిగువన ఉన్న కాలనీలోకి వెళ్లడంతో విషయం బయటకు పొక్కింది. అసలు మొదటినుంచి చెరువు అలుగులు ఎక్కడ ఉన్నాయి వాటిని అభివృద్ధి చేయకుండా ఎవరు అడ్డుకుంటున్నారు అని పలువురు ప్రశ్నిస్తున్నారు. చెరువులు కుంటలను కాపాడుకోలేక పోతే మానవ మనుగడకే ముప్పు పొంచి ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అన్నోజిగూడలోని మీరాలం కుంట అలుగును గుర్తించి రికార్డుల్లో ఉన్న ప్రకారం పునరుద్ధరించాలని పలువురు పర్యావరణవేత్తలు డిమాండ్ చేస్తున్నారు.

గండిపెట్టిన వారిని గుర్తిస్తాం



మీరాలం కుంటలో అదనపు నీరు దిగువకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన పైపులను తొగించిన గుర్తు తెలియని వ్యక్తుల కోసం ఆరా తీస్తున్నాం. చెరువులు , కుంటలను ఆక్రమించినా, కట్టలకు, అలుగులను ధ్వంసం చేసిన కఠిన చర్యలు తీసుకుంటాం, అన్నోజిగూడలోని మిరాలం కుంటకు అలుగు నిర్మాణం కోసం ఉన్నాతాదికారుల దృష్టికి తీసుపోతాం. చెరువుల పరిరక్షణ కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

\- పరమేష్, ఏఈ, ఇరిగేషన్ శాఖ, ఘట్‌కేసర్

మాల మహానాడు సింహగర్జన కరపత్రం విడుదల


కరపత్రం విడుదల చేస్తున్న గజ్జుక పరశురామ్

శామీర్‌పేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మాలల హక్కుల సాధనకు సంఘటితం కావాలని మాల మహానాడు మేడ్చల్ జిల్లా కన్వీనర్ గజ్జుక పరశురాం అన్నారు. మండల కేంద్రంలో మాల మహానాడు సింహగర్జన కరపత్రాలను శుక్రవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 27వ తేదీన శామీర్‌పేట మండల వ్యాప్తంగా నిర్వహించనున్న మహాపాదయాత్ర విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు మండల అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి బాలేష్, మండల యువజన నాయకులు వెంకటేష్, మురళి, మోహనకృష్ణ పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

తాండూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తాండూరు పీపుల్స్ డిగ్రీ కళాశాలలో గ్లోబల్ యువతరం ఫౌండేషన్ ఉద్యాన్ ఉచిత కంప్యూటర్ శిక్షణను శుక్రవారం సబ్‌కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ ప్రారంభించారు. యువకులు ఈ శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఉత్తమ్ చంద్, జాతీయ బీసీ సంఘం కార్యవర్గసభ్యులు రాజ్‌కుమార్, కంప్యూటర్ ప్రతినిధులు అరుణ్ గుప్తా, శ్రీంకల, గ్లోబల్ యువతరం ఫౌండేషన్ ప్రతినిధులు విజయేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో ప్రావీణ్యం సాధించాలి

కీసర రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో ప్రావీణ్యం సాధించాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శ్రేయోభిలాషి ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం క్రికెట్ కిట్లను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాములు, కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, ట్రస్టు సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కర్ర వెంకటేశ్వర్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, బీజేపీ నాయకులు వేణుగోపాల్, శ్యాంసుందర్‌శర్మ, రవీందర్‌రెడ్డి, నాగరాజు, కిషోర్, సూర్యశేఖర్, నరేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి


బాసుపల్లిలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

దోమ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) విద్యార్థులకు విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో మహేశ్‌బాబు అన్నారు. మండలంలోని బాసుపల్లి, శివారెడ్డి పల్లి పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంట ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవి పాల్గొన్నారు.

కులకచర్ల: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ మురళీధర్ తెలిపారు. స్థానిక ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. రోజువారీగా మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాలకు బెంచీలు వితరణ

నవాబుపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో విద్యార్థులకు జేమ్స్ మైనింగ్ సంస్థ చేయూతనివ్వడం అభినందనీయమని గేటువనంపల్లి మాజీ సర్పంచ్ యం.రత్నం అన్నారు. గేటువనంపల్లిలో పాఠశాల విద్యార్థులకు జేమ్స్ సంస్థ ఆధ్వర్యంలో బెంచీలు సమకూర్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రోహన్ ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కీసర, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు బెలిదె రమేష్ గుప్తా మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. రెండు రోజుల కిందట కీసర గ్రామానికి చెందిన మొరుగు చంద్రయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. చంద్రయ్య నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో బెలిదె రమేష్‌గుప్తా చంద్రయ్య కుటుంబ సభ్యులకు రూ.5వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు.

దోమ: మండలంలోని బొంపల్లికి చెందిన బోడా నర్సింహులు తల్లి బాలమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్, మహేశ్, ఇంతియాజ్, యాదయ్య, ప్రభు, బషీర్, హైమద్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.